# గాలినై పోతాను...గగనానికి

కె.వి.నరేందర్




జగిత్యాల బస్టాండ్ చాలా రద్దీగా వుంది...

వచ్చీపోయే ప్రతి బస్సులోనూ ఫుట్‌బోర్డ్ దగ్గర వ్రేలాడేంత జనం. ఎవరి పనుల కోసం వారు పరుగులు తీస్తున్నట్టు...ప్రపంచంలో ప్రశాంతత కనుమరుగైందనడానికి నిదర్శనంగా జనం కోలాహలం...

సంధ్య ఆరో నంబర్ బస్టాప్ దగ్గర అసహనంగా నిల్చుంది. మరోవైపు కాలేజికి టైమవుతోంది...అయినా బస్సు జాడలేదు.

బస్సు సరే...ఈరోజు అతడేడి...??

చప్పున అతడు గుర్తు రాగానే...మనసు తెర దించేసింది. తనేమిటి? అతడి గురించి ఆలోచిస్తుంది. ఈ మధ్య మరీ ఆలోచిస్తుంది...

దాదాపుగా ఎనిమిది నెలల్నించి ఒకే బస్సులో వెళ్లటం వల్లనేమో...ముందు ముభావంగా చూసుకునే వాళ్లు.. తర్వాత కళ్లతో నవ్వుకునేవారు...ఆ తర్వాత పెదాలు విచ్చుకునేవి...ఆ తర్వాత కళ్లూ పెదాలు విచ్చుకొని విష్ చేసుకునేవి...బస్సు రష్‌గా వున్నప్పుడు ఇద్దరూ ఒకేచోట అనీ అననట్టు నిల్చోవాలన్న చిలిపి కోరిక మనసులో ఏ మూలో పెరిగి పెరిగి...అలా నాలుగైదుసార్లు జరిగి పలకరింపు వరకూ వచ్చింది. ఆ పలకరింపులు బస్సు కుదుపులకి శరీరాలు తాకి పులకరింపులు లేపేవి.

ఆ పలకరింపులు...కేవలం పేర్లు తెల్సుకోవటం వరకే ఆగింది.

ఇద్దరికీ గంటల తరబడి మాట్లాడుకోవాలని వుంది. సంధ్యకైతే మరీనూ..బస్సులో గుండె చిక్కబెట్టుకొని...మాటలు కూడదీసుకొని పలకరిద్దాం అనేలోపే జగిత్యాల సిటీ పొలిమేరల్లోనే అతడు బస్సాపి దిగిపోతాడు.

సంధ్య మరో అరగంట ప్రయాణం చేస్తుంది. ఆమె బి.యస్సీ. ఫైనల్ చదువుతోంది. ఆమె చదివే ప్రయివేట్ కాలేజి జగిత్యాలకి పన్నెండు కిలోమీటర్ల దూరం...

బస్సు వేగంగా వచ్చి ఆగింది. శత్రువు మీద దాడి చేసినట్టు ప్రయాణీకులు ఎగదోసుకుంటూ ఎక్కుతున్నారు. గంట, రెండు గంటలు నిల్చోలేక సీటుకోసం పడే ఆతృత. ఆర్టీసి 'ఆక్టోపస్' లా కదిలింది.

సంధ్య బస్సెక్కినా అతడి కోసమే చూస్తోంది. బస్సు బస్టాండ్ మలుపు తిరుగుతున్న టైంలో అతడు వేగంగా వచ్చి బస్సెక్కాడు. అతడు కన్పించగానే సంధ్య రిలీఫ్‌గా ఫీలయ్యింది. లేకపోతే ఆ రోజంతా ఏదో దిగులు. సంధ్యని చూసి ఫుట్‌బోర్డ్ మీదినించే అతడు నవ్వాడు.

"ఈ రోజైనా అతడి ఉద్యోగమేంటో ఖచ్చితంగా కనుక్కోవాలి. అతడు దిగే స్టేజిలో ఏ ఆఫీసులూ లేవు" అనుకుంది. అతడి ఉద్యోగం గురించి ఓసారి అడిగితే నవ్వాడు. నవ్వి "చెబితే మీరు జడుసుకుంటారు. నాతో మాట్లాడరేమో?" అని చెప్పాడు. ఎన్నిసార్లడిగినా అదేమాట.

సంధ్య ఈరోజు చాలా హుషారుగా వుంది. కారణం తన బర్త్‌డే. హాండ్‌బాగ్ లోంచి రెండు చాక్లెట్లను తీసి పట్టుకుంది. బస్సులో బ్యాలెన్స్‌డ్‌గా నిలబడటం కష్టంగా వుంది. అతడు జనాన్ని తోసుకుంటూ దగ్గరి వరకూ రాగానే...ప్రక్క సీట్లోని ఇద్దరు పాత బస్టాండ్‌లో దిగారు. సంధ్య చప్పున కూచుంటూనే "అనిల్...కూచో" అంది.

"సారీ...ఈరోజు లేటయింది." అంటూ కూచున్నాడు అనిల్.

"ఈ రోజొక విశేషముంది...ఈరోజు నా బర్త్‌డే" సిగ్గుపడుతూ గుప్పెట విప్పింది. అనిల్ ముఖమంతా ఓ కొత్తకాంతి..."నిజమా...నిన్న చెబితే మంచి ప్రెజెంటేషన్ ఇచ్చేవాణ్ణి" అంటూ ఒక



## సన్నీడియోల్ కసి

చాలా అట్టహాసంగా ఇంతకుముందు ఎవరూ చెయ్యనంత హడావుడిలో ప్రారంభించిన సన్నీడియోల్ 'లాడన్' సినిమా మొదట్లోనే బెడిసి కొట్టింది కానీ ఇప్పుడు అసలు ఆ సినిమా బయటకొస్తుందా? అని అందరూ అనుమానిస్తుంటే తాజాగా 'దిల్లగీ' అనే సినిమా మొదలుపెట్టాడు సన్నీ. వచ్చే సంవత్సరం మధ్యలో రిలీజు చేస్తానంటున్నాడు. కనీసం దీనికైనా గ్రహణం పట్టకుండా ఉండాలని కోరుకుందాం.

చాక్లెట్ తీసుకున్నాడు.

సంధ్యని ఓసారి నిశితంగా పరిశీలించాడు.

రోజూ పంజాబీ డ్రెస్‌లో వుండే తను...ఈ రోజు నేరేడు రంగు చీరలో తలలో మల్లెపూలతో వసంతం విచ్చుకున్నట్టు...విప్పారిన కళ్ళమీద వెన్నెల వర్షం కురుస్తున్నట్టు...గులాబి పెదాల మీద మంచు బిందువులు మెరుస్తున్నట్టు...చాలా...చాలా అందంగా వుంది.

ఆమె మోచేతిని గిల్లటంతో అతడు వాస్తవంలో పడ్డాడు.

టిక్కెట్స్ ఇష్యూ కాలేదని డ్రైవరు బస్సాపాడు. ప్రయాణీకులు ముచ్చట్లలో వున్నారు.

"ఈరోజు మీ బర్త్‌డే అని తెలీకపోయినా...ఎగ్జిబిషన్ అంతా తిరిగి మీకోసం ఓ చిన్న గిఫ్ట్ కొన్నాను" అంటూ జేబులోంచి కీచైన్ తీసిచ్చాడు.

"ఏం బాగాలేదు" తీస్కుంటూ నవ్వుతూ చెప్పింది సంధ్య. తాళం చెవులు తగిలించుకొనే గొలుసుకి ఓ చిన్నగాజు సీసా...అందులో పసుపు రంగు ద్రవం వుంది.

"ఆ కీచైన్‌లో ఓ ప్రత్యేకతుంది. సరిగ్గా చూడండి" చాక్లెట్ నోట్లో పెట్టుకుంటూ చెప్పాడతను. ఆమె కీ చెయిన్‌ని అటూ ఇటూ త్రిప్పింది.

"ఏమీ లేదే ప్రత్యేకత" అని అనేంతలోనే గాజు సీసాలోని పసుపు రంగు ద్రవంలో ఓ బియ్యం గింజ కనబడింది. దాని మీద I LOVE YOU అన్న అక్షరాలు కన్పించాయి. విభ్రమంగా చూసిందామె. అతడు పెదాలతో శరీరమ్మీద చెప్తున్నట్టు ఒళ్లంతా తీయగా కంపించింది...

గుండె, గొంతు మూగపోతుంటే అతడి చేతిని గిల్లి 'థాంక్యూ' అంది మెల్లగా. ఆమె కళ్లల్లో నన్నటి నీటిపొరను చూసాడతను. కండక్టర్ టికెట్స్ అనడంతో ఇద్దరూ తేరుకున్నారు. అనిల్ రెండు టికెట్స్ తీసాడు.

కాస్సేపటికి బస్సు కదిలింది...

"ఈరోజు మీతో చాలా మాట్లాడాలని వుంది. కాలేజికి ఒకపూట డుమ్మాకొట్టి వస్తాను. మీరు పనిచేసే ఉద్యోగం పేరు చెప్పరు. ఈరోజు ఎలాగైనా మీకోసం మీ ఆఫీసుకొస్తాను" అంది చిరుకోపంగా.

అతడు నవ్వి ఆ తర్వాత గంభీరంగా అయిపోయాడు.

"రావద్దు...మీరు మాత్రం అక్కడికి రావద్దు. మీరే కాదు ఎవ్వరూ రావద్దని కోరుకుంటాను" అన్నాడు.

"ఎందుకు?"

"అదంతే...సారీ"

సంధ్య చిన్నబోయింది. ఇద్దరి మధ్యా పదినిమిషాలు మౌనంగా దొర్లిపోయాయి. మరో అయిదు నిమిషాల్లో అతడు దిగిపోతాడు...

అతడు దిగిపోతాడు...అన్న ఆలోచనే ఆమెలో దిగులు నింపింది.

"ఈరోజు మళ్లీ ఎక్కడ కలవాలి మిమ్మల్ని...?" ఎటో చూస్తూ అడిగింది.

"మీకిష్టమైతే సాయంత్రం ఆరున్నరకి పార్క్‌కి రండి. నేను రోజూ పార్కులో రెండు గంటలు గడుపుతాను ఒంటరిగా.." చెప్పాడు అనిల్.

"మీరు చేసే పనేంటో మాత్రం చెప్పరు" ఉడుకుమోత్తనంగా అడిగింది.

"చెప్పను" నవ్వుతూ చెప్పాడు.

"చెప్పకపోతే మీతో పాటే బస్సు దిగి తెల్సుకుంటాను" అంది రోషంగా. అంతలోనే అతడు దిగాల్సిన స్టేజి వచ్చింది. అతడు సీట్లోంచి లేస్తూ...

"నువ్వు దిగొద్దు గాని...నా ఉద్యోగం చూసి అసహ్యించుకోనే మంచి మనసు నీకుందనుకుంటాను. వుంటేనే పార్క్‌లో కలువు" అని దిగిపోతూ తన విజిటింగ్ కార్డ్‌ని ఆమె చేతిలో పెట్టివెళ్లాడు.

బస్సు కదిలింది...

విజిటింగ్ కార్డ్ చదివిన సంధ్య క్షణంపాటు ఉలిక్కిపడింది...

ఆ తర్వాత నవ్వింది...అది బస్సు అన్న స్పృహ లేకుండా తెరలు తెరలుగా నవ్వింది.

బస్సులోని జనమంతా అవాక్కయి ఆమెనే చూస్తున్నారు...

పసిపిల్ల ఏదో విచిత్రాన్ని చూసి కేరింతలు కొడుతున్నట్టు...ఆమె విజిటింగ్ కార్డ్ చూస్తూనే పడీపడీ నవ్వుతోంది. వెనక సీట్లోని ఓ పెద్దావిడ "ఏంటమ్మాయ్...ఏంటా నవ్వు" అని కసురుకోవటంతో ఈ లోకంలో పడినా ఉప్పెనలా వస్తున్న నవ్వుని ఆపుకోవడం ఆమె తరం కాలేదు. నవ్వుకు కళ్లల్లో నీళ్లు చిప్పిల్లాయి. నవ్వుని ఆపుకోవటం తరంకాక కొంగుని నోటికడ్డం పెట్టుకొని విజిటింగ్ కార్డ్‌ని పదేపదే చదివింది.

పి.అనిల్‌కుమార్, ఎం.ఎ.
కాటికాపరి,
శ్రీ సత్యహరిశ్చంద్ర(రోటరి) స్మశాన వాటిక.
జగిత్యాల.

* * * * * సంధ్య పార్క్‌కెళ్లే సరికే అనిల్ సరుగుడు చెట్లమధ్య వున్న ఏనుగుబొమ్మ దగ్గర కూచున్నాడు. అనిల్‌ని చూడగానే విజిటింగ్ కార్డ్ గుర్తొచ్చి మళ్లీ నవ్వొచ్చింది. నవ్వుని ఆపుకుంటూ 'హలో మిస్టర్ కె.కె.' అంది ఎదురుగా వచ్చి.

అనిల్ ప్రశ్నార్థకంగా చూసాడు.

"అదేనండీ కె.కె అంటే మీ ఉద్యోగం...దానికో విజిటింగ్ కార్డు" అనిల్ పక్కనే కూచుంటూ నవ్వింది. అనిల్ కూడా నవ్వుతూ చెప్పాడు.

"నా ఉద్యోగం నా నోటితో చెప్పలేక మీకోసం మాత్రమే ప్రింట్ చేయించిన ఒకే ఒక్క విజిటింగ్ కార్డది."

"మొత్తానికి భలే ఉద్యోగం...ప్రపంచంలో ఇంకేదీ దొరకనట్టు...?"

"ఏం...నా ఉద్యోగం మీకు నచ్చలేదా? ఏదీ దొరకనప్పుడు అదికూడా చేయడం తప్పా?" అనిల్ మొహం కొంత వివర్ణం కావడంతో సంధ్య కూల్‌గా చెప్పింది.

"తప్పకాదు కాని...ఎందుకో మీలాంటి వారు.."

"ఆ ఉద్యోగం చేయొద్దంటారు...నా పరిస్థితులు నన్ను ఆ ఉద్యోగంలో దింపాయి. ఆరువందల రూపాయల జీతం కోసమే...తప్పదు. దానికైనా మూడొందలు లంచమిచ్చి జాయినయ్యాను తెల్సా? అన్నాడు ఉద్వేగంగా.

"వ్వాట్...కాటి కాపరి ఉద్యోగానికి లంచమా..?" ఆశ్చర్యంగా అంది సంధ్య.

"నువ్వింకా బ్రతుకు తెరువు కోసం బయల్దేరలేదు. అప్పుడు తెలుస్తుందిలే. మనం రోజూ వెళ్లే బస్సులో కండక్టర్ కుర్రాడు ఎం.టెక్. చదివాడట. అసిస్టెంట్ ఇంజనీర్ ఉద్యోగానికి ముప్ఫయ్‌వేలు లంచమడిగారని కండక్టర్‌గా జాయినయ్యాడు. అందుకే ఎవ్వరికీ టిక్కెట్లివ్వకుండా లంచం కూడబెడుతున్నాట్ట.." నడుం వాలుస్తూ అన్నాడు అనిల్. తర్వాత ప్యాంటు జేబులోంచి మల్లెపూల పొట్లం తీసి సంధ్య చేతిలో పెట్టాడు.

సంధ్య కళ్లు ఆనందంగా మెరిసాయి.

"ఆ దండ తమరి హస్తాలతోనే నా కురులను

అలంకరిస్తే సంతసిస్తాను" అంది కళ్లు చక్రాల్లా త్రిప్పుతూ. అనిల్ లేచి సంధ్య జడలో దండ గుచ్చాడు. సంధ్య సవరించుకుంది.

చప్పున ఆమె మెడ వంపులో ముద్దుపెట్టుకొని 'విష్ యూ హేపీ బర్త్ డే' అన్నాడు చెవిలో.

ఆమె ఒళ్లంతా విద్యుత్ తరంగాలు ప్రాకి... ఎక్కడో దాక్కున్న కోర్కెల తేనెతుట్టె జివ్వున లేచింది. పార్కులో జనం పల్చగా వున్నారు.

ఆమె చప్పున వెనుదిరిగి చటుక్కున అనిల్ చెంపమీద ముద్దెట్టుకుంది. సిగ్గుతో ముడుచుకు పోయింది.

అతడు ఆమె నడుం చుట్టూ చేయివేసి దగ్గర తీస్కున్నాడు. సంధ్య గువ్వపిల్లలా అతడి గుండెల మీద ఒదిగిపోయింది.

ఇద్దరి మధ్యా నిశ్శబ్దం...

కళ్లనిండా చిలిపి కోరికలు...

మనసు నిండా ఏదో ఉద్వేగం...

పది నిమిషాల తర్వాత 'అనూ...' అంది సంధ్య. ఆమె స్పర్శతో అతడి గొంతెప్పుడో మూగవోయింది. 'ఊ' అన్నాడు బలవంతంగా.

"ఏదైనా మాట్లాడు"

"ఏం మాట్లాడను?"

"పోనీ...ఏదైనా చెప్పు"

"ఏం చెప్పను?"

"ఏదైనా జోక్ చెప్పు" గోముగా అంది.

"జోకా...అయితే విను. ఒకాయన రోడ్డంటా వెళ్తూంటే రోడ్డు వానుకొని వున్న ఒక సమాధి మీద కూచొని మరోవ్యక్తి విసనకర్రతో గాలి ఊవుకుంటూ కన్పించాడు. ఈయనకి విచిత్రమ న్పించి "ఏమయ్యా...మరీ సమాధి మీద కూచొని గాలి విసురుకుంటున్నావ్. భయమేయట్లేదా?" అనడిగాడు.

దానికి వాడు "మరేం చేయనయ్యా...లోపల మరీ ఉక్కపోస్తోంది" అనటంతో ఆ వ్యక్తి ఉలి క్కిపడి ఒకటే పరుగు... " అనిల్ చెప్పటంలోనే సంధ్య గలగలా నవ్వింది.

నవ్వుతూనే "మొత్తానికి కాటికాపరి అన్పించుకు న్నావ్...మాట్లాడితే శవాలు, దయ్యాలు, దహనాలు, మరణాలు..."అంది.

అయిదు నిమిషాల వరకూ అలాగే నవ్వుతూ.. సడెన్‌గా నవ్వాపి "అనూ..మరణం మీద నీ అభిప్రాయమేమిటి?" అంది సీరియస్‌గా.

ఆమె అలా అడిగేసరికి అనిల్ సైతం కొంచెం గంభీరంగా అయిపోయాడు.

"మరణం...మల్లెపువ్వు లాంటిది.

దాని తాలూకు తెల్లదనం ప్రశాంతతైతే...

దానిలోని సౌరభం మనలోని మంచితనాన్ని వెదజల్లుతుంది...

అందుకే...మరణం...జననం కంటే గొప్పది!

మరణిస్తున్నానని దుఃఖించకు...నీ మరణమే మరొకరికి జీవనం..."

సంధ్య ఆలోచనగా భృకుటి ముడిచింది....అతడు చెప్తున్నాడు.

"మన మరణం వల్ల ఒక కట్టెలు అమ్మేవాడి కుటుంబం గడుస్తుంది...

ఒక కాటి కాపరి జీవితం గడుస్తుంది...తద్దినాలు పెట్టే బ్రాహ్మడి కుటుంబం సాగుతుంది. చిల్లర నాణేలు, మరమరాలు అమ్ముకునే వాడి జీవనం మన మరణంతోనే ముడిపడివున్నాయి. ఆకస్మిక మరణమైనప్పుడు అది డాక్టర్లనీ, లాయర్లనీ సైతం పోషిస్తుంది.

మన మరణం కొందరికి జీవితాల్నిస్తున్నప్పుడు... మరణానికి ఎందుకు భయపడాలి? అందుకే మరణం...జననం కంటే గొప్పది!"

సంధ్య నిశ్చలంగా అతడివైపే చూస్తుండిపో యింది. వాళ్లిద్దరి మధ్య స్మశాన నిశ్శబ్దమే అయింది. ఆ వాతావరణాన్ని తేలిక పరుస్తూ అతడు నవ్వి "సారీ...కాటి కాపరి అనుభవంతో..." అన్నాడు.

ఆమె నవ్వింది మళ్లీ.

నవ్వుతూనే "మీరు చాలా గొప్పగా చెప్పారు. కాని నాకు నవ్వొచ్చేది ఆరాధనతో నిండిన ఇద్దరు మనుష్యులు మొదటిసారి ప్రేమ వ్యక్తీకరించు కోవడానికి కల్సుకున్నప్పుడు మరణం మీద చర్చ జరగడం..." అంది.

కాటి కాపరిని ప్రేమిస్తే అంతే మరి..." అతడు నవ్వాడు ఆమెని దగ్గరకు తీస్కుంటూ...

* * * * *

పరీక్షలయ్యాక వేసవి సెలవులకని ఇంటికెళ్లిన సంధ్య లెటర్ కోసం అనిల్ ఎదురుచూపు లెక్కు వయ్యాయి. చితిమంటల మధ్య ప్రేయసి గురించి కలలు కనటం ఎంత దుర్లభమో గుర్తొచ్చి అతడికి నవ్వొచ్చేది.

ఓ రోజు సడన్‌గా కార్డొచ్చింది సంధ్యనించి.

"ఇక్కడ బోర్‌గా వుంది. నిన్ను చూడాలన్పిం చినా రాలేకపోతున్నాను. అనుక్షణం గుర్తొస్తున్నావు. ఎప్పుడో ఓసారి నీ ముందు ప్రత్యక్షమవుతాను- సంధ్య.

అది చదివిన అనిల్ నిరుత్సాహ పడిపోయాడు. ఎన్నో పేజీలు ప్రేమగా రాస్తుందని ఎదురుచూస్తే రెండుగీతలు అదీ హడావుడిగా మొక్కుబడిగా రాసింది. రానీ చెప్తా...అనుకుంటూనే ఆ ఉత్తరాన్ని పోస్ట్‌మార్టం గదిమెట్ల మీద కూచోని వందలసార్లు చదువుకున్నాడు.

అప్పుడే సైరన్ శబ్దం చేస్తూ వచ్చి ఆ గది ముందు ఆగిందొక జీపు.

దాని వెనకే అంబులెన్స్. ఒక అంబాసిడార్ వచ్చి ఆగాయి.

"ఇదేదో మర్డరో, ఆత్మహత్య కేసో అనుకొన్నాడు అనిల్. ఆడాళ్లరోదనలతో మరో జీపొచ్చి ఆగింది. డాక్టర్‌గారు స్కూటర్ మీదొస్తూనే పోస్ట్‌మార్టం గదిలో దూరాడు. మరు నిమిషంలో ఆ ప్రదేశం ఏడ్పులు, పెడబొబ్బలు పోలీసుల హడావిడితో నిండిపోయింది. అందరిలోనూ విషాదం. ఆడో మగో కన్పించలేదు. కాని శవాన్ని మాత్రం పోస్ట్ మార్టం గదిలోకి గబగబా తీస్కెళ్లారు. బంధువుల రోదనలు మిన్నుముట్టాయి.

అనిల్ తనవని గుర్తొచ్చి వెళ్లబోతూ...బీడీ కాలు స్తున్న జీపు డ్రైవర్‌ని అడిగాడు.

"ఏం కేసు గురూ?" అని.

"పెళ్లిష్టం లేక పెళ్లిబట్టల మీదే విషం మింగిం దట. పెద్దింటి కేసే" అన్నాడు.

"అలాగా" అనుకుంటూ వెళ్లాడు అనిల్.

శవాన్ని స్మశానం దగ్గరకి తీసుకువచ్చాడు.

స్మశానం రోదనలతో దద్దరిల్లింది.

ఆ హృదయ విదారకమైన రోదనలు వింటుంటే అనిల్‌కి జీవితంపై విరక్తిలా అనిపించింది.

రోజూ ఇలా ఈ ఉద్యోగంలో శవాలు, ఏడ్పుల మధ్యే కొనసాగితే తనూ ఓ బ్రతికున్న శవంలాగే తయారవుతాడేమో? ఈ ఉద్యోగం విడిచిపెట్టాలి. సంధ్యకోసమైనా విడిచిపెట్టాలి అనుకున్నాడు.

ఇంతలో ఒకాయన వచ్చి "ఏమయ్యా...కట్టెలు మంచివి కావా? శవం మీద సరిగా నిలవటం లేదు" అని కసురుకున్నాడు.

అనిల్ అసహనంగా చూసి "సరిగ్గా పేర్చండి...న నండి" అంటూ వచ్చి శవం మీద కట్టెల్ని ఓ పద్ధతిలో పెట్టసాగాడు. అటూ ఇటూగా 'పోటుమాకు'ల్ని నిలిపాడు.

కట్టెలు పూర్తిగా కప్పబడ్డాయి. ఏడ్పులు, అరుపుల మధ్య స్మశానం చిత్తడిగా వుంది. జారిపోతున్న ఓ కట్టెని సవరించబోతూ...పారాణి దిద్దుకున్న ఆ శవం ఎడంచేతి గుప్పిట మూసుకొని...ఏదో తాయిలం దాచినట్టుగా మూసుకొని వుండటం గమనించిన అనిల్ కనుబొమ్మలు ముడిపడ్డాయి.

ఆ గుప్పిటిలో ఏదో వుంది...అన్పించింది.

కట్టెని సవరిస్తూ...ఎవరూ గమనించకుండా మెల్లిగా బిగుసుకుపోయిన ఆ గుప్పిటను విప్ప దీసాడు. ఏమీ లేదు కాని. ..కాని చేతిమీద ఏవో అక్షరాలు...కళ్లతో చదివాడు.

"నిన్ను చూడాలన్పించి వచ్చాను-సంధ్య."

అతడి గుండె చిట్లిపోయింది...కపాలంలో నెత్తురూ పోటెత్తి మెదడు నరాలు మెలితి రిగి పోయాయి...కన్నీళ్లు గొంతులో సుడిగుం డాలయ్యాయి. సంధ్య మొహాన్ని చూసేంతలోనే నిప్పంటిచారేమో...

చితిమంటలు జివ్వున లేచాయి...మంటల జెండాలై...

అందరూ వెనుదిరిగారు...ఒక్క అతడు తప్ప!! ఒక విషాదగీతం అతన్ని వెంటాడుతూనే వుంది. అతడిప్పటికీ అక్కడే వున్నాడు...కాటికాపరిగా మాత్రం కాదు.

పిచ్చివాడిగా!!!